


# వదిన

సూర్యానికి పుట్టెరిగి అంత దెబ్బ తగల్లేదు.

దిగజారిన మనస్సు కక్షు రగులుతూ ఉడికిపోతూంది. నాన్నకూడ పల్లెత్తుమాట అసలేదు, ఎన్నడూ అన్నయ్య అనవసరంగా హుంకరించి తనపై పెత్తనం చెలాయించడం నిజంగా గుండెల్లో మంటపుట్టింది. "అంత సరదాగా ఉండే అన్నయ్య ఇంత దుడుగ్గా ఎలా మాట విసరగలిగేడు" అనుకుంటుంటే అన్నయ్యమీద పౌరుషం బుసలు కొడుతోంది.

ఆరోజు సూర్యం కాలేజీకి వెళ్ళేడు. కాని మనస్సునలిగి కలత చెందుతూనే ఉంది. క్లాసులో చెప్పేలెక్చర్లు వృథాగా సముద్రంలోకి ప్రవహిస్తున్న గోదావరిలా ఉన్నది. అతని మనస్సు పరిపరి విధాల పోయింది. ఏం చేసేది? ఎంత ఆలోచించినా అతని మనస్సు బుసలు కొడుతుంది. ఇంటికి మరలడానికి అతని మనస్సు ఒప్పడంలేదు.

స్నేహితుల కబుర్లు తన ఉద్రేకపు టంచులు ఆపలేక పోతున్నాయి. వాళ్ళతో నవ్వలేక పోతున్నాడు. కాలేజీ అయిపోయింతరవాత ఎవరికీ అందకుండా అవతలికి దాటుకున్నాడు. అన్నయ్య మాటలు జ్ఞాపకమొస్తుంటే, ఉద్రేకం ఉబుకుతుంది. ఎవరికీ కనిపించకుండా పార్కులో కూర్చుని అదేపనిగా ఆలోచించేడు. ఉద్రేకం తప్ప అతనికి ఏ పర్యవసానం అందడంలేదు. స్నేహితుల ముఖాలనుండి ఉష్ట్రపక్షిలా తల దాచుకున్నాడు.

చీకటిపడింది. ఉద్రేకంతో నీరసపడిపోయేడు. వదినతన్ని పలకరించినట్టనిపించింది. తట్టి లేపుతున్నట్టు అతని శరీరం పులకరించింది. తన ఒంటిమీద ఈగవాలితే ఆవిడ ఊరుకోదు. సూర్యం అంటే అంత అబ్బరం. అయితే అన్నయ్యతన్ని అలా విసిరికొట్టినట్టు మాట్లాడ్డం వదినకు తెలియందా, అని మనస్సు ఎదురు తిరిగింది. "ఇద్దరూ నా గురించి ఆలోచించుకునే ఉండవచ్చు" కొంతె మనస్సు వెనక్కు లాగుతుంది. శరీరం వేడెక్కి అలిసిపోయింది. "అయితే తనెందుకు తిరిగి ఇంటికి వెళ్ళాలి?" అని భీష్మించుకుని చూస్తూ.

నక్షత్రాలు ఒక్కటొక్కటే అలంకరించుకుని ఆకాశరంగానికి వస్తున్నాయి. తొలుకుతూ కునుకుతూ పడుకున్న చందమామ సరిగ్గా కనిపించడం లేదు. చుక్కలు పిలిచినట్టుగా భ్రమపడి చూచేడు. అవి అతన్ని చూచేయి. 'వెధవగాడవ' అని గొణుక్కున్నాడు. మళ్ళీ అన్నయ్య రాహువులా అడ్డమొచ్చేడు తన సంతోషానికి. ముఖం దించుకుని కళ్లు కొరుక్కున్నాడు. చుక్కలన్నీ నవ్వేయి. సూర్యం సిగ్గుపడ్డాడు. మళ్ళీ ఆకాశం పూనింది. ఇంటికెళ్ళి శివతాండవ మాడాలనే వెర్రిబుద్ధి పుట్టింది. చుక్కలు వెక్కిరించేయి. సూర్యం గుండె దిగులుపడింది. గుప్పెటతో ఇసుక నలిపేడు. తెలియని ఉద్రేకంతో అడుగులు వేసేడు ఇంటివైపునకు.

గుమ్మంలోనే ఉంది వదినె. శూర్పణఖలా ఉందేం అనుకున్నాడు. కాని మనస్సు చివుక్కుమంది. మెల్లక్కుతున్నాడు. వదినె-"అన్నయ్య

కనిపించలేదా సూర్యం?" అని అడిగింది. అతని గుండెల్లో శిఖలెత్తి మండినట్టనిపించింది. ముఖం కొరకంచులా పెట్టుకుని తొందరగా ఇంట్లోకి నడిచేడు. వదినె సూర్యాన్ని పిలిచింది. పలకలేదు. తొందరగా లేచి భోజనం చేయమన్నది. ముఖం దించుకుని ఆవిణ్ణి అనుసరించేడు. తను చేస్తున్న ప్రతి పని అచేతనంగా ఉంది. నీళ్ళు దిమ్మర పోసుకుని, పీటమీద చతికలబడ్డాడు.

వదినెను చూస్తుంటే అభిమానం విరుచుకు పడుతుంది. తల వంచుతుంది. ఆమె దీపంపక్క వెలుగుతుంది. చూడాలని ప్రయత్నించినా మాడ లేకపోయేడు. బరువయ్యేడు భోజనం సాగడం లేదు. వదిన "సూర్యం అలా ఉన్నావేం నాయనా" మెల్లిగా అడిగింది. సూర్యానికి ఎత్తుకుని బుజ్జగించి నట్టనిపించింది. అంతవరకూ బిట్టుచేసిన ఉద్రేకం తనని పిరికివాణ్ణి చేసింది. వదినె ముఖం చూడలేక తొందరగా చెయి తొలుచుకుని గదిలోకి పరుగెత్తేడు. వెనుక వదిన పిలుస్తుంది. ఆ మాటలు తనకు వినిపించలేదు. తలుపులు గడియ వేసుకుని మంచంమీద వాలిపోయేడు.

గదంతా చీకటి చేసుకున్నా అశాంతి తగ్గలేదు. చెవుల్లో గింగురు, కణత లెగరగొడుతున్న కోపం మంచంలో కళ్లు మూసుకున్నా తగ్గలేదు. కొంత సేపటికి తలుపుతట్టి నట్టనిపించింది. చెవులు నిక్కించేడు. వదిన తనను పిలుస్తుంది, "సూర్యం తలుపు తియ్" అని. ఆమె ఎంత చక్కగా పిలుస్తుంది– మాతృదేవి మారాం పెట్టిన కూనను బుజ్జగిస్తున్నట్టున్నది. సూర్యం చిన్ని పట్టె కాదే? అందుకే అతనికి సిగ్గు మరీ ఎక్కువయింది, తన చిలిపి ఆలోచనలతో అతనికి తలుపు తీయడానికి ధైర్యం చాలలేదు. ఆమె పిలుస్తున్న ప్రతిసారి సూర్యానికి సుత్తులతో మోదుతున్నట్టనిపిస్తుంది. నిస్పృహలో నిద్రపోయేడు కొంతసేపు.

అతని మూర్ఛపుపట్టు కుంటిపోతుంది. ఇంత వరకూ తన ప్రవర్తన తనకే సిగ్గుగా ఉంది. అన్నయ్యమాటకు వదినెందుకు కించపరచాలి? అయినా ఇప్పుడావిడ ముఖం ఎలా చూడడం? మనస్సు మథనపడింది. నల్లటి ఆకాశంలో చుక్కలు తన్నింకా వెక్కిరిస్తున్నాయి. తెలివి తక్కువ తనానికి చించుకున్నాడు. ఇంత జరిగింతరవాత ఏంచేసేది? సిగ్గుతో చచ్చి ఎలా మాట్లాడేది? అన్నయ్య వచ్చి మళ్ళీ తన్నే ప్రస్తావిస్తాడేమో? అన్నయ్య మాటలు బుసకొట్టి లేపుతున్నాయి. "బి.ఏ. చదివి ఎవర్నుద్ధరించడానికి? గుమాస్తాగా ఎనభై రాళ్ళతో ఎలా ఈడ్చి చచ్చేదీ?" తను ఫీజు కట్టడానికి డబ్బు అడిగితే అంతమాట అంటాడని అనుకోలేదు. నాన్న తన్ని చదివించలేదా బి.ఏ. వరకూ, "నాన్నే ఉంటే..." ఉద్రేకంతో పళ్లు నొక్కుకుని పిడికిలి బిగించేడు.

మళ్ళీ తలుపుమీద శబ్దం. వదినే పిలుస్తోంది. తలుపు తీయకూడదని మంచానికి బోర్ల పడుకున్నాడు. "తలుపుతీయి సూర్యం" ఆమెపై తను చిన్నప్పటినుండీ నిలిపిన మాతృప్రేమ తన్ని తట్టి లేపింది. అతని ప్రేమ ఉప్పొంగి పడి లేచింది. ప్రేమపూర్వకంగా ఆవిడ ఆజ్ఞాపిస్తున్నట్టుంది.

తలుపు తెరుచుకుంది. కుప్పగా కూలి నేలను చూస్తున్న సూర్యాన్ని సరోజమ్మ జాలిగా చూచింది. "ఏం నాయనా అలా ఉన్నావు, జ్వరం తగిలిందా?" అని ఒళ్లుతట్టి అడిగింది. సూర్యానికి వెంటనే ఆవిడ కాళ్ళమీదపడి తప్పు క్షమించమని అడుగుదామనుకున్నాడు. సరోజమ్మ ముందు నడిచింది. వెనకాలే కిక్కురు మన కుండా సూర్యం నడిచేడు. దిగాలుపడిన సూర్యం ముఖం పైకెత్తింది. సూర్యం వదిన కాళ్ళమీద వాలిపోయేడు. సరోజమ్మ ఓదార్చింది. ఆవిడ చెప్పినట్టు విన్నాడు. పట్టుపట్టి ఆవిడ వడ్డించిన భోజనం పూర్తిచేసేడు. చదువుకునే గదిలో దీపం అమర్చి చదువుకోమంది.

చమురు దీపం రెపరెపలాడుతూ కొట్టుకుంటుంది. సూర్యం నీరసంగా పరధ్యానంతో చూస్తున్నాడు. "దీపం రెపరెపలాడితే చదువెలా సాగుతుంది సూర్యం? ఏదీ దీపం నేను సరిచేస్తాను" అంది సరోజమ్మ. బరువుగా దించుకుపోయినా నోరు అనుకోకుండా జవాబిచ్చింది. "నేను సరిచేసుకుంటాను వదినా, నీ పన్లు చూచుకో."

"అన్నయ్య యింకా రాలేదుగా. ఉండూ దీపం సరిచేస్తాను. చదువుకోవడానికి ఆలస్యం కదూ?"

ఆవిడ చిరునవ్వు ముఖం తన మూర్ఖత్వాన్ని కొట్టినట్టనిపించింది. దీపం ఆరిపోయింది. సూర్యం బరువుగా "క్షమించు వదినా" అన్నాడు.

సూర్యం అమాయకత్వాన్ని ఓదారుస్తూ "ఎందుకయ్యా అంతబాధపడతావు, నాతో చెప్ప రాదా?" సరోజమ్మ సాధారణంగా అడిగింది.

సూర్యం చీకట్లోకి పిచ్చివాడిలా దిక్కులు చూస్తూ మూగవాడయ్యేడు. సరోజమ్మ చేతి క్రింద కోలుకుంటున్న రోగిలా శాంతపడు తున్నాడు.

"ఏంనాయనా మీ అన్నయ్య రుడుకుగా అన్న మాటలు పట్టించుకున్నావా?" అన్నయ్య మాటలు మళ్ళీ జ్ఞాపకానికి తట్టడంతో పసి పిల్లాడిలా ఏడ్చేడు. వదినె కాళ్లదగ్గరే ఆమె తడికళ్ళతో-"సూర్యం ఇంత పిచ్చివాడవు తావనుకోలేదు ఛా! తప్పు" అని తట్టి లేపింది.

నిశ్శబ్దంలో ఆమె కంఠం మ్రోగింది—"అన్నయ్య మాటలు పట్టించుకోకు... ఆయనా నీలాగనే బి.ఏ., చదివి ఏదో గుమాస్తా ఉద్యోగం సంపాదించి ఓ ఎనభైరాళ్లు తేగలుగుతున్నారు. పెద్దాళ్ళు రెండుమాటలు మితిమీరినా చిన్న వాళ్లు పట్టించుకోడం తప్పుకదూ? మనందరకూ సరిపోని ఈ ఇంటికే ముప్పై రూపాయలు పోయాల్సొస్తుంది. మనగోడు వినేదెవరు? మనకు మనం కాకపోతే. ఈ గుమాస్తా జీవితంలో ఆయన బ్రతుకు మరీ ముళ్ళపొదలా ఎలామారిపోయిందో చూస్తున్నావుకదూ? ఆయన్ని మనం ఇముడ్చు కోకపోతే మరెవరు ఇముడ్చుకుంటారు చెప్పు. చిన్నతనపు కోపంతో మాటపట్టించుకుంటే, ఆయనకుమాత్రం మనస్సు నొచ్చుకోదూ. ఆయన బాధలు మనమూ ఆలోచించాలి..."

సూర్యం "క్షమించు వదినా" అని గట్టిగా అరిచి ఏడ్చేడు. సరోజమ్మ ఓదార్చింది. లేచి తూగిపోతు సరోజమ్మ "నిద్రపో సూర్యం. ఇప్ప టికే బాగా రాత్రి కావస్తుంది" అంది.

ఆవిడ మెల్లిగా అవతలిగదిలోకి నడిచి దీపం సర్దుకుంటుంది. సూర్యాన్ని తన పిచ్చితనం తన్నే వెక్కిరిస్తుంది. "అన్నయ్యకు మొగమెలా చూపిం చేది?" అదే మాటిమాటికి గుండె పిండుతుంది. అన్నయ్య ఇంకా ఇంటికిరాలేదే? చటుక్కున మంచంమీదనుంచి లేచి, కుమార్ మీద దుప్పటి కప్పుతున్న వదినదగ్గిర నిలబడ్డాడు.

"ఏం నిద్రపట్టడంలేదా?" వదిన అడిగింది.

"లేదు వదినా, అన్నయ్య ఇంకారాలేదు..."

"ఆయనకింకా ఆఫీసులో పని తీరలేదేమో? నువ్వు తొందరగా నిద్రపో, చాలా రాత్రయిం దిగా" అన్నది.

ఈడ్చుకుంటూ గదిలోకి వెళ్ళి మంచంమీద వాలేడు. ఆలోచనల్లో కొట్టుకుపోయి, అలిసి ఎప్పుడు నిద్రపట్టిందో తనకే తెలీదు, కుమార్ మంచమెక్కి కాళ్ళతో తొక్కేవరకూ మెలకువ రాలేదు. బారెడు పొద్దెక్కింది. వంటగదిలో వదినె అలికిడి వినబడుతుంది.

"ఇద్దెను ... బాబాయ ..." అని వంట గదివైపు కుమార్ చెయిపట్టుకుని లాగు తున్నాడు. పిల్లిలా అవతలికి నడిచేడు. అన్నయ్య కుర్చీలో కూర్చుని ప్రపంచాన్ని మరిచిపోయి ఆఫీసు కాగితాలు తిరగేస్తున్నాడు....

సూర్యం పుస్తకం ముందుపెట్టుకుని పుటలు తిరగేస్తున్నాడు ఖాళీబుర్రతో. నిన్నటి ప్రవర్తన తలంచుకుంటూ కలవరంగా పేజీలు తిప్పుతున్నాడు.

"చదువుకుండేవాడికి తిండిలో ఎంత జాగ్ర త్తగా ఉండాలి. తొందరగా కాఫీ తీసుకో"— వినిపించడంతో తొట్రుపాటుగాలేచి నుంచు న్నాడు. అన్నయ్యే తిరిగి తనను మందలిస్తూంట. వనే టిఫిన్, కాఫీ ముందుపెట్టేడు. కుమార్ — "ఇద్దెన్న - నాకోతి" అని మారాంచేస్తున్నాడు. సరోజమ్మ ద్వారండగ్గిర నిలబడి అన్నదమ్ముల మీదికి చిరునవ్వులు కురిపిస్తోంది.

---

జీవితం పేకముక్కల ఆటవంటిది: నీకు తెలియని ఏ అదృశ్య హస్తమో ముక్కలు పంచుతుంది: నీ చేతికి వచ్చిన ముక్కలతోనే నువ్వు ఆట ఆడి గెలవ డానికి ప్రయత్నించాలి. అటువంటి పంచే పద్ధతి నచ్చకపోయినా సరే, ఆటలో ఒక ఆకర్షణ ఉంది: అందుకే ఆడాలనే ఆసక్తి.—యూజిన్ వార్